సాక్షి నిర్మల్

శనివారం । 28 । జనవరి । 2023



అంగన్‌వాడీల్లో ఆకుకూరల సాగు
గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కిచెన్‌గార్డెన్లు సత్ఫలితాలనిస్తున్నాయి. 9లో▸



సరస్వతీ అమ్మవారికి లక్ష్మీకటాక్షం
జిల్లాలోని బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారికి వసంతపంచమి సందర్భంగా గురువారం ఒక్కరోజే రూ.71.91లక్షల ఆదాయం సమకూరింది. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.0 /16.0
వాతావరణం పొడిగా, మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు ఒకటి రెండు డిగ్రీలు తగ్గుతాయి. వేకువజామున మంచు కురుస్తుంది. చలి స్వల్పంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పర్యటన

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో శనివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటిస్తారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు తెలిపారు. శ్రీలక్ష్మీనర్సింహ రైస్‌మిల్లు ప్రారంభోత్సవం, పార్టీ విస్తరణలో భాగంగా మహారాష్ట్రలోని అప్పారావుపేట్, శివిని గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

‘బీసీల ఐక్యతతో రాజ్యాధికారం’


సమావేశంలో మాట్లాడుతున్న నర్సగౌడ్

పెంబి: దేశ, రాష్ట్ర జనాభాలో 50శాతం ఉన్న ఓబీసీలు పార్టీలకు అతీతంగా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని, ఐక్య ఉద్యమాల ద్వారానే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం శెట్‌పల్లి గ్రామంలోగల శివాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మోర్చా మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిందే పాండ్‌రంగ్, ఉపాధ్యక్షులుగా బొజ్జ సురేశ్, కైలాస్, దేవేందర్, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్, ప్రవీణ్, కార్యదర్శులుగా కృష్ణ, హరీశ్, దత్తును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సదాశివ్, నాయకులు శేఖర్, మల్లేశ్, సురేశ్, రాజు, లక్ష్మణ్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం ఈ నెల 30న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన దీక్ష పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలో ఆవిష్కరించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో పోరాడి సాధించుకున్న తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై తలపెట్టిన దీక్షను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు కోరారు. ఈ నెల 31న ఇదే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తాట్ర భీంరావు, కల్యాణ్, బెన్నీ, సతీశ్, కిషన్, విజయ్, రాహుల్, నరేశ్ తదితరులున్నారు.

‘కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి’

లక్ష్మణచాంద: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు కోరారు. శుక్రవారం లక్ష్మణచాంద, పార్‌పెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. బూత్‌స్థాయిలో కార్యకర్తలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి, నిరంకుశ పాలనను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి కలమల్ నయన్, మండలాధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు రంజిత్, నాయకులు లింగన్న, రాజు, గంగాధర్, హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి’


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

భైంసాటౌన్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని డీసీసీ అధ్యక్షుడు డీ ముత్యంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలోని పార్టీ కార్యాలయంలో హాత్ సే హాత్ జోడోపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర ఈనెల 30న ముగియనుందని, ఇందులో భాగంగా జిల్లా, మండలకేంద్రాల్లో యాత్రపై సమీక్ష నిర్వహించి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పాలన తీరును ఎండగట్టేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం హాత్ సే హాత్ జోడో కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్‌రావు పటేల్, కాంగ్రెస్ నాయకులు సత్యం చంద్రకాంత్‌రెడ్డి, ఆలూరు ప్రశాంత్, అహ్మద్, భూమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచమి పాట్లు


వసంతపంచమి సందర్భంగా బాసరలో క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు (ఫైల్)

భైంసా: చదువులతల్లి సరస్వతీ అమ్మవారు కొలువైన బాసరలో భక్తులను సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా ఉత్సవాల సందర్భంగా వారి పాట్లు అన్నీ.. ఇన్నీ కావు. తాజాగా గురువారం వసంత పంచమి సందర్భంగా వేలాదిగా వచ్చిన భక్తులకు పాత సమస్యలే ఎదురయ్యాయి. భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని తెలిసినా అధికారులు తాత్కాలిక పనులపైనే దృష్టిపెట్టారు. ఫలితంగా వసంతపంచమి సందర్భంగా ఇక్కడకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఇక్కడి ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తంజేశారు.

- చదువులమ్మ చెంత.. సమస్యల చింత
- ఏటా భక్తులకు తప్పని ఇబ్బందులు
- క్యూలైన్లలోనే గంటలతరబడి నిరీక్షణ
- పిల్లల ఏడుపులు.. పెద్దల పెడబొబ్బలు
- కనీస వసతులు కరువై భక్తుల ఇక్కట్లు

శాశ్వత చర్యలేవి?
వసంతపంచమి సందర్భంగా బాసరకు భారీగా తరలివచ్చిన భక్తులు క్యూలైన్లలో గంటలతరబడి నిరీక్షించారు. ఆలయం తరపున భక్తులు, పిల్లలకు పండ్లు, పాలు పంపిణీ చేసినా అవి ఎటూ చాలలేదు. అక్షరాభ్యాస మండపంలోని గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఇక్కడ ఏ ఉత్సవం జరిగినా ప్రతీసారి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. అన్నీ తెలిసిన అధికారులు ఈ విషయంలో తాత్కాలిక ఏర్పాట్లు మినహా శాశ్వత చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. దేశంలోనే ఖ్యాతిగాంచిన సరస్వతీ అమ్మవారి క్షేత్రమైన బాసరలో చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు జరిపిస్తే ఉన్నతస్థానాలకు ఎదుగుతారన్న నమ్మకంతో ఇక్కడకు వస్తుంటారు. ఏర్పాట్లు సరిగా లేక ఇక్కట్లకు గురవుతున్నారు.

ఇలాగైతే సమస్యలుండవు..
బాసర వచ్చే భక్తులకు క్యూలైన్‌కు వెళ్లే మార్గంలో పూర్తిగా తిరుమల తరహాలో గదులు నిర్మించాలి. అక్కడ కాసేపు పిల్లలు అటూఇటూ తిరిగేలా విశాలమైన స్థలం ఉండాలి. వసంతపంచమి, శివరాత్రి, దసరా ఉత్సవాలు, వేసవి సెలవుల సందర్భంగా భక్తుల రద్దీ పెరిగినా మండపాల్లో ఒకరి వెనుక మరొకరిని పంపించే ఏర్పాట్లు చేయాలి. ముందుగా లోనికివెళ్లిన వారి చిన్నారుల అక్షరాభ్యాసాలు పూర్తి చేయిస్తే.. వెనుక నుంచి వచ్చినవారంతా గదుల్లో కాసేపు విశ్రాంతి తీసుకునే అవకాశముంటుంది. పైగా అత్యవసరాలకు తగ్గట్లుగా ఈ గదుల్లోనే మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలి. దర్శనానికి ఎక్కువ సమయపడితే అక్కడే పులిహోర, పండ్లు, పాలు పంపిణీ చేయాలి. అలాగే సుదూర ప్రాంతాల నుంచి బాసరకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లు, సరిపడా ఆర్టీసీ బస్సులను నడపాలి. భక్తుల వాహనాల సంఖ్యకు సరిపడా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి. ఇలాగైతే ఇబ్బందులు తీరుతాయని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

తోపులాట.. ఉక్కపోత..


క్యూలైన్‌లో కూర్చున్న వృద్ధురాలు (ఫైల్)

ఇంట్లో ఓ చిన్నారికి అక్షరాభ్యాసం అనగానే అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలు, మేనమామలు, మేనత్తలు, బాబాయ్‌లు ఇలా అందరికీ పండగే. ఒక చిన్నారి అక్షరాభ్యాసం ఉంటే ఆ ఇంటిల్లిపాది బాసరకు వచ్చి కార్యక్రమాన్ని జరిపిస్తారు. బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని వెళ్తారు. వృద్ధులు క్యూలైన్లలో మోకాళ్ల నొప్పులతో కూర్చోలేక ముందుకువెళ్లలేక నీరసించిపోతున్నారు. చిన్నపాటి క్యూలైన్లలో ఎటూ కదలలేని పరిస్థితిలో గంటల తరబడి ఉండాలంటే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులు తోపులాట కారణంగా కిందపడుతున్నారు. పిల్లల ఏడుపులు.. పెద్దల పెడబొబ్బలతో క్యూలైన్లలో గందరగోళ పరిస్థితి నెలకొంటోంది.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పుడే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఉత్సవాలు జరిగే సమయంలో తాత్కాలిక ఏర్పాట్లుచేస్తున్నాం. అంచనాకు మించి భక్తులు వస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇకముందు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వసంతపంచమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు.

– విజయరామారావు, బాసర ఆలయ ఈవో

‘మాస్టర్’.. మిస్టరీ!


జెండా ఎగరేసి ఐక్యత చాటుతున్న రైతుప్రతినిధులు (ఫైల్)

- బృహత్ ప్రణాళిక రద్దు లేనట్లేనా..!?
- ముసాయిదాలో సవరణలేనా..?
- స్వయంగా మంత్రి చెప్పినా ఆబ్జక్షన్స్
- బాధితుల్లో ఇప్పటికీ అనుమానాలు
- డ్రాఫ్ట్‌పై 200కు చేరిన అభ్యంతరాలు
- ఆందోళన తప్పదంటున్న ప్రతిపక్షాలు

నిర్మల్: నిర్మల్ మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ మిస్టరీగా మారింది. బృహత్ ప్రణాళిక ఎటు పోతోంది..? ఏమేం మార్పులకు లోనవుతోంది..? అసలు ‘పట్టణం’లో ఏం జరుగుతోంది..? అనే విషయంపై ఇప్పటికీ అధికార పార్టీలోని నేతలు, కౌన్సిలర్లకే క్లారిటీ లేకపోవడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా మాస్టర్‌ప్లాన్లను రద్దు చేస్తున్నట్లు తన వద్దకు వచ్చిన రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు. కానీ.. మున్సిపల్‌లో మాత్రం అదేమీ పట్టనట్లు అభ్యంతరాల స్వీకరణ యథావిధిగా కొనసాగుతోంది. ఇక మాస్టర్‌ప్లాన్ ముసాయిదాపై అభ్యంతరాల ప్రకారం సవరణలు చేస్తామంటూ స్వయంగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ డ్రాఫ్ట్ పట్టుకుని ప్రజల వద్దకు వెళ్తున్నారు. అటు మంత్రి మాటను నమ్మాలా.. లేక చైర్మన్ చెప్పినట్లు వినాలా..? అన్న అయోమయం పట్టణ ప్రజల్లో నెలకొంది. రైతు జేఏసీలోనూ అనుమానాలు అలాగే కొనసాగుతున్నాయి. మరోవైపు ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ బృహత్ ప్రణాళిక రద్దుకు పట్టుబడుతూ ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

మరోసారి కలిసి..
మాస్టర్‌ప్లాన్ ముసాయిదా బాధిత రైతులంతా ఇప్పటికే రైతు ఐక్యకార్యాచరణ కమిటీగా ఏర్పడ్డారు. తమకంటూ 20మంది ప్రతినిధులతో కమిటీని కూడా ఎన్నుకున్నారు. మంత్రి, చైర్మన్‌ను పలుసార్లు కలిసి తమ గోడు విన్నవించారు. తమలో ఐక్యతను చాటేందుకు గణతంత్ర దినోత్సవం రోజున రైతు జేఏసీ తరఫున మువ్వన్నెల జెండానూ ఎగురవేశారు. ప్రభుత్వ తీరు, స్థానికంగా పాలకుల మాటలు తమలో అనుమానాలు పెంచుతున్నాయని, తమకు స్పష్టమైన విధానం తెలుపాలని వారు కోరుతున్నారు. ఈక్రమంలో మరోసారి నేడో, రేపో మున్సిపల్ చైర్మన్‌ను కలుస్తామని చెబుతున్నారు.

ఆందోళన వైపు ప్రతిపక్షాలు..
జిల్లాకేంద్రంలో ఏకపక్షంగా మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను రూపొందించారని, తమకు అనుకూలంగా అధికారపార్టీ ప్రతిపాదనలు చేసిందని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ ఆరోపిస్తున్నాయి. ప్రజలను ఇబ్బంది పెట్టేలా, పాలకులకు లబ్ధి చేకూర్చేలా ఉన్న మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. రానున్న తరాలతో పాటు పట్టణాభివృద్ధికి ఉపయోగపడేలా మాస్టర్‌ప్లాన్ ఉండాలని కోరుతున్నాయి. ఈమేరకు బీజేపీ, కాంగ్రెస్ ఆందోళనలను ఉధృతం చేస్తామంటున్నాయి.

ఎవరి మాట నమ్మాలి?
మాస్టర్‌ప్లాన్‌లో ప్రధానంగా జోన్ల మార్పు, కొత్త రోడ్ల ప్రతిపాదనలు ఇబ్బందికరంగా మారాయి. వీటిపైనే చుట్టూ వ్యవసాయ భూములున్న రైతులు, ప్లాట్లు కోల్పోతున్న భూయజమానులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్‌లోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా మాస్టర్‌ప్లాన్లను రద్దు చేస్తున్నట్లు స్వయంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రైతులకు చెప్పారు. ఒక్క రైతుకు సంబంధించిన ఇంచు భూమి కూడా పోదని, ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని స్పష్టంచేశారు. రైతుల అనుమతి లేకుండా మాస్టర్‌ప్లాన్ ముందుకు సాగదని హామీ ఇచ్చారు. దీంతో బాధిత రైతులు భరోసా పెట్టుకున్నారు. కానీ.. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, అధికారులు మాత్రం యథావిధిగా ‘అభ్యంతరాలు స్వీకరిస్తాం, సవరణలే చేస్తాం..’ అంటూ ప్రజల్లోకి డ్రాఫ్ట్ పట్టుకుని వెళ్తున్నారు. వచ్చేనెల 9లోపు మాస్టర్‌ప్లాన్ ముసాయిదాలోని ప్రతిపాదనలపై ఎలాంటి అభ్యంతరాలున్నా చెప్పండి.. సరిచేస్తామంటున్నారు. ఈనేపథ్యంలో సదరు రైతుల్లో రోజురోజుకూ అనుమానాలు పెరుగుతున్నాయి. మంత్రి చెప్పింది నమ్మాలా.. లేక చైర్మన్ చెప్పినట్లు విని అభ్యంతరాలు ఇవ్వాలా.. అనే సందిగ్ధావస్థలో ఉన్నారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తన బంధువులు, అనుచరుల లబ్ధి కోసమే మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదనలు ఉన్నాయి. జోన్ల మార్పిడిలో వారికి లాభం చేకూరేలా.. సామాన్యుడికి నష్టపరిచేలా మార్పులు చేశారు. వీటిని రద్దు చేసేదాకా కాంగ్రెస్ ఆందోళనలను ఉధృతం చేస్తుంది.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్

గవర్నర్ దృష్టికి తీసుకెళ్తాం



నిర్మల్‌లో ఇష్టారీతిన రూపొందించిన మాస్టర్‌ప్లాన్, అధికార పార్టీ నాయకులు తమ లబ్ధి కోసం చేసిన ప్రతిపాదనలను రద్దు చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. దీనిపై సోమవారం ధర్నాకూ సిద్ధమవుతున్నాం. అలాగే నిర్మల్‌లో జరుగుతున్న అక్రమాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్తాం.

– అప్పాల గణేశ్‌చక్రవర్తి, మున్సిపల్ మాజీచైర్మన్

అధికారికంగా అందలేదు



ప్రస్తుతం ఉన్నది మాస్టర్‌ప్లాన్ ముసాయిదా మాత్రమే. దీంట్లో చేసిన ప్రతిపాదనలపై అభ్యంతరాలు తెలుపవచ్చు. ఇప్పటివరకు మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ రద్దుకు సంబంధించి తమకు అధికారికంగా ఎలాంటి ఆదేశాలు అందలేదు. శుక్రవారం వరకు మొత్తం 193అభ్యంతరాలు వచ్చాయి.

– అరిగెల సంపత్, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

కంటి పరీక్షలు చేయించుకోవాలి

- కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖి
- కంటివెలుగు శిబిరాల పరిశీలన


లోకేశ్వరం: జోహర్‌పూర్‌లో శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖి

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖి సూచించారు. శుక్రవారం మండలంలోని హద్‌గాం, జోహర్‌పూర్ గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కళ్లద్దాలు పంపిణీ చేయాలని సూచించారు. రోజువారీగా కంటి పరీక్షల నివేదికను సంబంధిత అధికారులకు పంపించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత, మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, నాయకులు భోజన్న, దిగంబర్ తదితరులున్నారు.

కుంటాల మండలంలో..
కుంటాల : మండలంలోని అంబకంటితండా పంచాయతీ పరిధి హనుమాన్ నగర్‌తండాలోని కంటివెలుగు శిబిరాన్ని కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖి పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, తహసీల్దార్ కలీం, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, డాక్టర్ శృతిరెడ్డి, పీఆర్ ఏఈ సూర్యతేజ తదితరులున్నారు.

నర్సాపూర్(జీ) మండలంలో..
నర్సాపూర్(జీ): మండలంలోని బామిని(బీ) గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ దేవోళ్ల పుష్పల ప్రారంభించగా, కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ హేమంత్ బొర్కడే, ఉపసర్పంచ్ విఠల్‌రావు, ఎంపీటీసీ నర్సమ్మ, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ అమృతయాని, పంచాయతీ కార్యదర్శి గంగాజల పాల్గొన్నారు.

నేడు నాందేడ్‌కు మంత్రి ‘అల్లోల’

- వచ్చేనెల 5న రానున్న సీఎం కేసీఆర్
- బీఆర్‌ఎస్‌లోకి పలువురి చేరికలు


గతనెల 22న కీనిలో పర్యటిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

నిర్మల్: బీఆర్‌ఎస్‌ను మహారాష్ట్రలో విస్తరించేందుకు నాయకులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఓసారి సరిహద్దు రాష్ట్రంలో పర్యటించి వచ్చిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ పనిలో భాగంగా శనివారం మరోసారి నాందేడ్ జిల్లాలో అడుగుపెట్టనున్నారు. వచ్చేనెల 5న నాందేడ్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. ఆ కార్యక్రమ సన్నాహకాల్లో భాగంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నాందేడ్ వెళ్తున్నారు. పార్టీ విస్తరణతోపాటు, మద్దతుదారులను కలిసి సీఎం కేసీఆర్ కార్యక్రమానికి ఆహ్వానించనున్నారు. పార్టీవర్గాల సమాచారం మేరకు వచ్చేనెల 5వ తేదీన భారీ బహిరంగ సభ కాకుండా చేరికల కార్యక్రమాన్ని మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిసింది.

మంత్రి పర్యటన ఇలా..
నాందేడ్‌కు వెళ్లే క్రమంలో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పలు మహారాష్ట్ర గ్రామాలకు వెళ్లనున్నారు. కిన్వట్ తాలూకాలోని అప్పారావుపేట్, షివిని, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్, భోకర్‌ల మీదుగా నాందేడ్ బయలుదేరనున్నారు. అనంతరం నాందేడ్ జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. పార్టీ విస్తరణలో భాగంగా గతనెల 22వ తేదీన నాందేడ్ జిల్లా భోకర్ తాలూకాలోని కీని, పాలజ్ గ్రామాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పర్యటించారు. అక్కడి రైతులు, వివిధ వర్గాలతో సమావేశమయ్యారు. అప్పుడే త్వరలో నాందేడ్‌కు సీఎం కేసీఆర్ వస్తారని ప్రకటించారు.

‘దివ్యాంగులంతా ఐక్యంగా ముందుకుసాగాలి’


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

నిర్మల్‌టౌన్: దివ్యాంగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని, హక్కుల సాధనకు కృషి చేయాలని సమదృష్టి క్షమత వికాస్ ఏవం అనుసంధాన్ మండల్ (సక్ష్యమ్) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఉప్పుకష్టం రాజు సూచించారు. సక్ష్యమ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల సేవా కేంద్రాన్ని జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లో శుక్రవారం జిల్లా దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఆత్మవిశ్వాసమే ఆయుధమని పేర్కొన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. సక్ష్యమ్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సక్ష్యమ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సేవా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా సంఘ్ చాలక్ నూకల విజయ్‌కుమార్, సంఘ సభ్యులు పంచగుడి మహేశ్, కత్రోజి అశోక్, నరేశ్, శ్రీవాణి, సగ్గం రాజు, శ్రీరామ్మూర్తి, దివ్యాంగ సంఘ నాయకుడు సట్టి సాయన్న పాల్గొన్నారు.

సౌత్‌ఇండియా సైన్స్‌ఫేర్‌కు ఎంపిక


యంత్రం పనితీరును వివరిస్తున్న రమేశ్

సారంగపూర్: మండలంలోని చించోలి(బీ) గ్రామంలోగల జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు రమేశ్ సౌత్‌ఇండియా సైన్స్‌ఫేర్‌కు ఎంపికయ్యాడు. రమేశ్ ఈనెల 31వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగే ఉపాధ్యాయ సైన్స్‌ఫేర్‌లో పాల్గొననున్నారు. సోలార్ విద్యుత్ సహకారంతో సైకిల్ విడిభాగాలను ఉపయోగించి రూపొందించిన బహుళ ప్రయోజనాలను అందించే అత్యాధునిక వ్యవసాయ యంత్రాన్ని రూపొందించి ఇందులో అర్హత సాధించారు. ఈయంత్రం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు, తక్కువ వ్యయంతో సాగుచేసే విధంగా వ్యవసాయ రంగానికి ఉపయోగపడుతుందని సదరు ఉపాధ్యాయుడు తెలిపారు. ఈయంత్రాన్ని మరింత అధునాతనంగా రూపొందించి రైతులకు ఉపయోగపడేలా అందుబాటులోకి తీసుకొస్తానని ఉపాధ్యాయుడు రమేశ్ తెలిపారు. తన ఆవిష్కరణకు లభించిన ఆదరణతో జాతీయ సైన్స్‌ఫేర్ ఎంపిక కావడం పై ఆయన ఆనందం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్రగాయాలు



ముందుభాగం దెబ్బతిన్న కారు

తాంసి: అతివేగంతో వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన తాంసి ఆరోగ్య కేంద్రం సమీపంలోని మూలమలుపు వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాంసి మండల కేంద్రానికి శైలేష్ గురువారం రాత్రి ఆదిలాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. సుంకిడి, తాంసి గ్రామాల రోడ్డుపై అతివేగంగా కారు నడుపుతున్నాడు. అదుపుతప్పి మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఢీకొన్నాడు. డ్రైవింగ్ చేస్తున్న శైలేష్ తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

నేరడిగొండ: మండల కేంద్రంలోని అంకుల్ లొద్దిగుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని శుక్రవారం పట్టుకున్నట్లు స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ (ఎస్‌బీ) నారాయణ స్వామి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మిగతా నలుగురు పరారీలో ఉన్నట్లు వివరించారు.

ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్‌బోర్డు కాలనీ జోన్ 3లో నివాసం ఉంటున్న పెద్ది చిన్న శేఖన్న ఇంట్లో గురువారం చోరీ జరిగింది. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. పెద్ది చిన్న శేఖన్న మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగొచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో 17 తులాల బంగారు, 33 తులాల వెండిని ఎత్తుకెళ్లారని గుర్తించారు. రూ.5,26,500 విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీ చేశారని శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి, ఎస్సై విష్ణువర్ధన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక కిడ్నాప్, లైంగికదాడి

- ఒకరిపై పోక్సో కేసు

మామడ: మండలంలోని ఓ గ్రామం నుంచి మైనర్ బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన గైక్వాడ్ సునీల్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సోన్ సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. సునీల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బాలికను వేధించిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని డాల్డా కంపెనీ ప్రాంతానికి చెందిన మైనర్ బాలికను వేధించిన కేసులో ఒకరిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై విష్ణుప్రకాశ్ కథనం ప్రకారం ..17 ఏళ్ల బాలికను పట్టణానికి చెందిన గెడాం సునీల్ వెంటపడి వేధింపులకు పాల్పడుతున్నాడు. శుక్రవారం బాలిక బహిర్భూమికి వెళ్లిన సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కుటుంబీకులకు విషయాన్ని తెలిపింది. దీంతో వారు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘ఆదర్శ’ం పిలుస్తోంది..

- మోడల్ స్కూల్లో 6 నుంచి 10 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు
- ఫిబ్రవరి 15 చివరి తేదీ
- 6వ తరగతిలో ఉమ్మడి జిల్లాలో 1400 మంది విద్యార్థులకు అవకాశం
- ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష



ఆసిఫాబాద్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభావంతులైనా నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యకు ఈ పాఠశాలు దోహద పడనున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితం ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 2013లో ఆదర్శ పాఠశాలను నెలకొల్పింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ (యూ), మందమర్రి, మంచిర్యాల్, కుంటాల, కోటపెల్లి, కాసిపేట్, దండేపల్లి, నార్నూర్, గుడిహత్నూర్, జైనథ్, బోథ్, ఆదిలాబాద్ (బంగారుగూడ), బజార్‌హత్నూర్‌లో ఈ పాఠశాలలు ఉన్నాయి.

సీట్ల కేటాయింపు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలో 6వ తరగతిలో 14వందల మంది విద్యార్థుల ప్రవేశం ఉంటుంది. దీంతోపాటు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2022–23 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది మధ్యలో వివిధ కారణాలతో మానివేసిన ఖాళీ సీట్ల ప్రవేశం కోసం అవకాశం ఉంటుంది. ప్రవేశాలు రోస్టర్ పద్ధతిలో నిర్వహిస్తారు. 100 సీట్లలలో ఎస్సీ విద్యార్థులకు 15 శాతం, ఎస్టీ విద్యార్థులకు 6శాతం, బీసీ విద్యార్థులకు 29శాతం ఉంటాయి. ఇందులో (బీసీ ఎ–7) (బీసీ బి–10) (బీసీ సీ–1)(బీసీ డి–7)(బీసీ ఈ–4)తో పాటు ఓపెన్ కేటగిరీలో 50 సీట్లను భర్తీ చేయనున్నారు. అన్నీ కేటాగిరీలోనూ బాలికలకు 33 శాతం, 3శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించనున్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు ఇలా..

ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వైబ్‌సైట్ వైబ్‌సైట్ http//telanganams.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి పాస్‌ఫోటో, ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బోనఫైడ్ జిరాక్స్ పత్రాలు ఏ పాఠశాల ప్రవేశం కోసం నమోదు చేసుకున్నామో ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలి.

ప్రవేశ పరీక్ష విధానం

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఐదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్ సబ్జెక్టుల నుంచి ఒక్కొదానిలో 25ప్రశ్నలు ఇస్తారు.

మోడల్ స్కూల్ ప్రత్యేకత...

- 6 నుంచి 10వ తరగతి వరకు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా బోధన
- ఆంగ్ల మాధ్యమంలో విద్య
- పక్కా భవనంతో తరగతి గదులు
- 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వమే పుస్తకాలను అందజేస్తుంది.
- సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ సదుపాయం.
- నాణ్యమైన మధ్యాహ్నభోజనం, పౌష్టికాహారం అందజేత.
- 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలకు ప్రతిభ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- 10వ తరగతి విద్యార్థులకు ఎన్‌టీఎస్‌ఎకు ప్రత్యేక శిక్షణ తరగతులు

ఫిబ్రవరి 15 తుది గడువు

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కోసం జనరల్ కేటాగిరీ విద్యార్థులకు రూ.200 ఈడబ్ల్యూఎస్ దివ్యాంగుకలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 8వ తేదీ నుంచి 12వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుంది.

లోకల్ విద్యార్థులకు ప్రాధాన్యత



ఆదర్శ పాఠశాలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో 6వ తరగతిలో 100 సీట్లు మిగితా 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేస్తాం. లోకల్ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తాం.

– అబ్దుల్ ఖలీల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్

రేపు వైఎస్సార్‌టీపీ ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం

కైలాస్‌నగర్: వైఎస్సార్‌టీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఆదిలాబాద్‌లోని భజరంగ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యచరణ కమిటీ సభ్యులు పిట్ట రాంరెడ్డి, గట్టు రామచంద్రా రావు, మాజీ జెడ్పీచైర్మన్ కవిత, కొండ రాఘవ రెడ్డి, నిర్మల రమేశ్, శాంతికుమార్, ఏపూరి సోమన్న ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి పార్టీ ఉమ్మడి జిల్లా నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

పొచ్చరలో దొంగల హల్‌చల్



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దొంగలు

బోథ్: మండలంలోని పొచ్చరలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. గతకొన్ని రోజులుగా గ్రామంలో కొంతమంది అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. గురువారం రాత్రి లక్ష్మణ్‌కు చెందిన బైక్‌ను దొంగిలించారు. రోడ్డుపై దొంగలు వెళ్తున్నట్లు సీసీ సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. అందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానికులు పేర్కొంటున్నారు.

బుడుందేవు ఆలయంలో పూజలు

- నేటి నుంచి జాతర ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: కేస్లాపూర్ నాగోబా జాతర అనంతరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే బుడుందేవు జాతర శనివారం ప్రారంభం కానుంది. నాగోబా పూజల అనంతరం గురువారం మెస్రం వంశీయులు ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌కు చేరుకుని శుక్రవారం మధ్యాహ్నం బుడుందేవు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు పాల్గొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించినట్లు ఎంపీపీ తెలిపారు. సర్పంచ్ మల్లిక, ఆలయ చైర్మన్ మెస్రం నాగోరావు, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, పంటేల్ మెస్రం వంశీ పటేల్, కటోడ, మెస్రం వంశీయులు, స్థానికులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ, సర్పంచులు

ఎట్టకేలకు భార్యాభర్తలు ఒకేచోటికి

- జిల్లాకు 10 మంది స్పౌజ్ టీచర్ల కేటాయింపు
- జిల్లా నుంచి నిజామాబాద్‌కు ఒకరు
- ఫలించిన ఉపాధ్యాయుల ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: భర్త ఒక చోటా..భార్య మరోచోటా విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్న స్పౌజ్ టీచర్లకు ప్రభుత్వం ఎట్టకేలకు తీపికబురు అందించింది. గతేడాదిగా ఆందోళనలు చేపడుతున్న విషయం తెలిసిందే. జీవో 317 ద్వారా జిల్లాలోని స్పౌజ్ ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు కేటాయించారు. దీంతో భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం బదిలీ, పదోన్నతులు చేపడుతున్న నేపథ్యంలో స్పౌజ్ టీచర్లకు సైతం శుభవార్త అందించింది. గురువారం రాత్రి రాష్ట్రప్రభుత్వం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు పరస్పర బదిలీలకు అనుమతి ఇచ్చినప్పటికీ 13 జిల్లాల్లో బదిలీలను నిషేధించిన విషయం తెలిసిందే. తాజాగా వాటిని ఎత్తివేసి వారు పనిచేస్తున్న చోటికి రిలీవ్ చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించింది.

జిల్లాకు పది మంది టీచర్లు

జీవో 317 ద్వారా జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు కేటాయించారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 45 మంది నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు బదిలీ చేశారు. దీంతో భర్త ఒక చోటా, భార్య మరోచోటా విధులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురయ్యారు. డీఈవో కార్యాలయం, కలెక్టరేట్, డీఎస్ఈ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఎట్టకేలకు వారి ఆందోళనలు ఫలించాయి. ఈ స్పౌజ్ బదిలీల్లో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు 10 మంది టీచర్లు రాగా, జిల్లా నుంచి ఒకరు నిజామాబాద్‌కు వెళ్లనున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు నిర్మల్ నుంచి ముగ్గురు, ఆసిఫాబాద్ నుంచి నలుగురు, మంచిర్యాల నుంచి ముగ్గురు వస్తున్నారు. వీరిలో పదిమంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇంకా 38 మంది ఇతర జిల్లాలో స్పౌజ్ టీచర్లు పనిచేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. వారికి సైతం అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కాగా శుక్రవారం సాయంత్రం విద్యాశాఖాధికారులు వారికి పోస్టింగ్‌లు కేటాయించారు.

అటవీశాఖ అధికారులపై చర్యలు చేపట్టాలి



నిరసన చేపడుతున్న గిరిజన నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: నార్నూర్ మండలం నాగులకొండ గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు లింబారావుపై అటవీ శాఖ అధికారులు చేసిన దాడిని నిరసిస్తూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. కొలాం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సోనేరావు మాట్లాడుతూ దాడి చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కొమురం సూరు యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, కొలాం హక్కుల పోరాట సమితి జైనథ్, బేల మండలాల అధ్యక్షులు గోవింద్‌రావు, టేకం లక్ష్మణ్, పురుషోత్తం, శేషారావు, శత్రుగన్, కేశవ్, మోతిరాం, నాగేశ్, గణేశ్, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: లింబారావుపై దాడి చేసిన అటవీ అధికారులను శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అటవీ కార్యాలయాన్ని తుడుందెబ్బ అధ్వర్యంలో ముట్టడించి ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి 20 ఎకరాల అటవీ భూమి సాగు కోసం కేటాయించాలన్నారు. కుటుంబంలో ఒకరికి అటవీశాఖలో ఉద్యోగం, రూ.20 లక్షలు నష్టపరిహారం అందించాలన్నారు. నాయకులు నాగోరావ్, పరమేశ్వర్, బోంత ఆశారెడ్డి, నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రోత్సాహకం’లో జాప్యం

- పేరుకుపోయిన కేసీఆర్ కిట్ పథకం బకాయిలు
- ఆసుపత్రుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ
- జిల్లాలో 8,891 మంది లబ్ధిదారుల నిరీక్షణ
- సకాలంలో జమా చేయాలని కోరుతున్న లబ్ధిదారులు



ఆదిలాబాద్‌రూరల్: మాతాశిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులకు ఆదరణ పెరగాలన్న లక్ష్యంతో సర్కారు వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేసుకున్న వారికి కేసీఆర్ కిట్‌తోపాటు నగదు అందించారు. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు కిట్లు ఇస్తున్నా నగదు అందడం లేదు. ఫలితంగా వారు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగు విడతలుగా అందజేసే ప్రోత్సాహకానికి నానా పాట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. నిధుల కొరత వల్లే మంజూరు కావడం లేదని తెలుస్తోంది.

8,891 మంది నిరీక్షణ

రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని జూన్ 2017 ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేస్తోంది. నాలుగు విడతలుగా సాయాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమచేయాలి. 30 నవంబర్ 2022 వరకు కిట్ పొందిన వారు 32,344 ఉండగా 23,453 మందికి ఆర్థిక సాయం అందుకున్నారు. 8,891 మంది లబ్ధిదారులకు ఇంకా రావాల్సి ఉందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. పథకంలో భాగంగా గర్భం దాల్చిన మహిళకు మొదట రూ.3 వేలు ఖాతాలో జమ చేస్తారు. కాన్పు కాగానే ఆడశిశువు అయితే రూ.5 వేలు, మగ శిశువు అయితే రూ.4 వేలు, మూడు నెలల తర్వాత రూ.2 వేలు, తొమ్మిది నెలలకు రూ.3 వేలు, ఇలా నాలుగు విడతలుగా లబ్ధిదారులకు అందజేస్తారు. అయితే రెండు ప్రసవాలకు మాత్రమే ఇది అందుతోంది. ప్రభుత్వం కేసీఆర్ కిట్ అమలు చేశాక, సర్కారు దవాఖానాల్లో కాన్పుల సంఖ్య పెరిగింది.

సకాలంలో అందని డబ్బులు

కాన్పులు జరిగి నెలలు గడిచిపోతున్నా నగదు అందక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. పైసలు వస్తే పౌష్టికాహారానికి వినియోగించుకునే వారమని పేర్కొంటున్నారు. ఆసుపత్రిలో సిబ్బందికి ఆడిగితే నిధులు విడుదలైన వెంటనే నేరుగా ఖాతాల్లోకి వస్తాయని సర్ది చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తిస్థాయిలో తమ వివరాలు నమోదు చేయడం లేదని అందుకే సాయం అందడం లేని మరికొంతమంది వాపోతున్నారు.

రెండేళ్ల నుంచి డబ్బులు రాలేదు

నేను 2020లో రిమ్స్‌లో మగ శిశువుకు జన్మించాడు. అప్పుడు కేసీఆర్ కిట్ ఇచ్చారు. ఇప్పటి వరకు ప్రోత్సాహకానికి సంబంధించిన డబ్బులు రాలేదు. ప్రభుత్వం ఆ డబ్బులు ఇస్తే పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయి.

– మ్యాకల స్వప్న, లాండసాంగ్వి, ఆదిలాబాద్ రూరల్

నేరుగా వారి ఖాతాల్లో..

గర్భిణులు, బాలింతలకు సంబంధించిన ప్రోత్సాహక నిధులు నేరుగా వారి ఖాతాలో జమా అవుతాయి. దశలవారీగా అందిస్తున్నారు. రానివారు ఆందోళన చెందొద్దు.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్

భయాన్ని పోగొట్టడమే పరీక్ష పే చర్చ లక్ష్యం



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

ఆదిలాబాద్: విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టడమే ‘పరీక్ష పే చర్చ ’లక్ష్యం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ ‘పరీక్ష పే చర్చ’ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌ఈడీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయగా, బీజేపీ నాయకులు, విద్యార్థులతో కలిసి శంకర్ వీక్షించారు. ప్రధాని విద్యార్థులను ఉద్దేశించి పరీక్షల గురించి భయాన్ని వదిలేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదినాత్, ఆకుల ప్రవీణ్, రాజేష్, శ్రీనివాస్, ముకుంద్‌రావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

మంత్రాల నెపంతో హత్యాయత్నం

రామకృష్ణాపూర్: మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో ఒకరిపై ఐదుగురు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. గురువారం అర్ధరాత్రి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మందమర్రి సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ... కాగజ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సత్తార్ కొంతకాలంగా స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలోని దర్గా నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మంత్రాలు చేస్తూ అదే ప్రాంతానికి చెందిన పలువురు అనారోగ్యానికి కారణమవుతున్నాడని, అలాగే కొంతమంది మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పట్టణానికి చెందిన బుడిగె వంశీ, ప్రకాష్, రవి, సాయి అనే నలుగురితో పాటు దర్గాకు ఆనుకునే ఉన్న స్థలం విషయంలో గతంలో సత్తార్‌తో గొడవపడిన బీజేపీ నాయకుడు పాలరాజయ్య కలిసి దర్గాలో నిద్రిస్తున్న సత్తార్‌పై ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలైన సత్తార్‌ను కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఐదుగురిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.



చికిత్స పొందుతున్న సత్తార్

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం

భీమిని: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు ఇందూరి మహేష్ తన చేనులో పండిన సుమారు 250క్వింటాళ్ల పత్తికి ధర లేకపోవడంతో ఇంటి వద్ద ఉంచుకున్నాడు. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా సుమారు 15క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. దీంతో రూ.లక్షా 50వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. సంఘటనా స్థలాన్ని కన్నెపల్లి ఎస్సై సురేష్ పరిశీలించి షార్ట్ సర్క్యూటా? ఎవరైనా నిప్పంటించా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.



మంటలు ఆర్పివేస్తున్న రైతులు

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కాగజ్‌నగర్ డీఎస్పీ

సిర్పూర్(టి): జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న యువకుడిని పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. సిర్పూర్(టి) జీపీ శివాపూర్ గ్రామానికి చెందిన దోని గోపి కొంతకాలంగా సిర్పూర్(టి)లోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల పట్టణంలోని సత్యనారాయణ ఇంట్లో 24.5 గ్రాముల నెక్‌లెస్, చెవి కమ్మలు, ముక్కు పుడక అపహరించగా, కొతూతరి బుజ్జి ఇంట్లో 12 తులాల బంగారం దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. అలాగే దొంగిలించిన సుమారు రూ.లక్షా 85వేల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న కౌటాల సీఐ బుద్ధేస్వామి, సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేష్‌లను అభినందించారు.